వులు కాసే కుర్రాడు.

“ఏమి ఆట?” అని సెక్రటరీ అడిగాడు.

“టమాటాలు కోసే ఆట సార్! ఎవరెక్కువ కోస్తే వాళ్ళు గెల్చినట్టన్నమాట” అన్నాడు నవ్వుతూ.

ఆడవాళ్ళు తమలో తాము మాట్లాడుకున్నారు. మగవాళ్ళు గూడా ఇదేదో బాగుందే. వంగి టమాటాలు కోస్తే తిన్నది అరుగుతుంది అనుకున్నారు.

“సరేరా అబ్బాయ్! మేము రెడీ” అన్నాడు సెక్రటరీ.

వాడు అందరికీ తలా ఒక బుట్ట ఇచ్చాడు. సెక్రటరీ టైమ్ చూసి “స్టార్ట్” అన్నాడు.

అంతా టమాటా పొలంలో పడి పండినవి, దోరకాయలు గబగబా కోసి బుట్టల్లో నింపసాగారు. ముప్ఫైమంది గంటసేపు కోసేసరికి టమాటా పొలంలో కాయలన్నీ బుట్టల్లో నిండాయి.

సెక్రటరీ అందరి బుట్టలూ చెక్ చేసి గంగాధర్ బుట్టలో ఎక్కువ కాయలున్నట్లు నిర్ధారించాడు. రెండో స్థానంలో విశాలాక్షి నిల్చింది. సెక్రటరీ వాళ్ళకి ముందే తెచ్చిన గిఫ్ట్‌ప్యాక్‌లు అందజేశాడు. అంతా చప్పట్లు కొట్టారు.

ఇక చీకటి పడబోతున్నదని అందర్నీ బస్ ఎక్కమన్నాడు సెక్రటరీ. తర్వాత పొలంలో వున్న కుర్రాడి దగ్గరికి వెళ్ళి “నువ్వు చెప్పిన ఆట బాగుందిరా! మా వాళ్ళంతా బాగా ఎంజాయ్ చేశారు” అంటూ వంద రూపాయలు నోటు వాడికి ఇవ్వబోయాడు.

“వద్దు సారూ!” అంటూ ఆ కుర్రాడు మొఖమాట పడ్డాడు.

“ఫరవాలేదు తీసుకో. నీ వల్ల మా వాళ్లంతా బాగా సంతోషించారు” అన్నాడు సెక్రటరీ.

“మాకూ మీ వల్ల సంతోషమే సారూ!” అన్నాడు.

“ఎలా?”

“టమాటాలు కొయ్యడానికి కూలీ వాళ్ళని పెడితే ఐదొందలు అయ్యేది సార్!” అన్నాడు నవ్వుతూ.

సెక్రటరీ బిత్తరపోయాడు.

“ఔను సార్! టమాటాకు రేటు లేదు సార్! కూలీలతో కోయిస్తే గిట్టుబాటుకాదని అట్టనే వదిలేశాడు మా అయ్య. రేపు ఈ బుట్టలు మార్కెట్‌కి బండిలో తోల్తే లాభమే సార్!” అన్నాడు వాడు.

“ఓర్నీ మిమ్మల్నే ఆట ఆడించావు కదరా! పల్లెటూరి వాళ్ళు తెలివితక్కువ వాళ్ళనుకున్నాను. ఇన్ని తెలివి తేటలు ఎక్కడ్నుంచి వచ్చాయిరా బాబూ!” అని గొణుక్కుంటూ బస్సెక్కాడు సెక్రటరీ.

-వాణిశ్రీ (హైదరాబాద్)

# జాజి పందిరి


కథా నిలయం
శ్రీకాకుళం

జాజి పందిరి తీగలతో రెమ్మలతో, పూలతో కళకళలాడుతోంది. దాబా అంతా పాకిపోయింది. చక్కని పందిరి వేసారు. అందరూ కావలసినన్ని పూలు కోసుకుంటున్నారు. ఆ ఇంటావిడ తన స్నేహితురాళ్ళతో వేసవికాలం సాయంత్రాలు జాజి పందిరి కింద ఆనందంగా కాలక్షేపం చేస్తున్నారు. ఆ ఇంటి యజమాని కూడా ఆదివారాలు జాజిపందిరి క్రింద స్నేహితులతో పార్టీలు చేసుకొంటున్నాడు. ఆరోజుకారోజు తీగ అనేక చిన్న చిన్న తీగలతో శోభాయమానంగా ఎదుగుతోంది. గాలివానలకు కూడా పడిపోకుండా దాబా అంచులకు గట్టిగా పెనవేసుకుపోయింది. ఆ ఇంటివాళ్ళ కొడుకు, కూతురూ కూడా వాళ్ళ స్నేహితులతో చక్కగా అక్కడే ఆడుకుంటున్నారు. వారింటికి వచ్చే బంధువులు కూడా సాయంకాలాలు అక్కడే గడుపుతున్నారు. అదంతా చూస్తున్న జాజితీగ తెగ మురిసిపోతోంది.

కానీ ఆ తీగకు క్రింద తన జన్మస్థలం కేసి చూడాలని కూడా అనిపించటం లేదు. తను పైకి ఎగబ్రాకడానికి తన మొదలులో పాతిన కర్ర గురించిగాని దానికి ఆసరగా వేసిన త్రాడు గురించిగాని అది ఏనాడు గుర్తుకుతెచ్చుకోలేదు. ఎందుకంటే పైనుంటేనే ఆనందం క్రిందకు చూస్తే అంతా చీకటి, చివికిపోయిన తాడు పుచ్చిపోయిన కర్ర కనిపిస్తాయి.

అయితే ఆ తీగను భూమిలో పాతి దాన్ని దాబాపైకి పాకించిన తోటమాలికి, దాబా ఎక్కి ఆ తీగ సౌందర్యం చూడాలని కోరికుంది. కానీ ఆ అవకాశం లేదు. దాబా ఎక్కాలంటే శరీరం సహకరించటంలేదు. ఆయాసం, నీరసం వస్తున్నాయి. ఎవరూ చేయి అందించి తీసుకెళ్ళేవారు లేరు. అలా నీరసంగా పైకి చూడ్డం తప్ప ఏమీ చేయలేక పోతున్నాడు.

అప్పుడప్పుడూ ఆ ఇంటికొచ్చే జనం ఆ తీగ గురించి దాని పూల వాసన గురించి పొగుడుతుంటే ఆ తోటమాలి వళ్ళు పులకిస్తుంటుంది. కొంతమంది ఆ ఇంటి యజమానిని మెచ్చుకుంటుంటే, కొంతమంది సంస్కారవంతులు ఆ తీగ నాటి పెంచిన తోటమాలికి ధన్యవాదాలు తెల్పాలి అన్నప్పుడు, ఆ తోటమాలి కళ్ళనుండి రెండు ఆనందపు నీటి బొట్లు రాల్తుంటాయి.

-ఎం.మోహనరావు (కాకినాడ)